# బ్రతుకు శరీరమ



వీరరాజు

ఆ అడవిలాంటి ప్రదేశంలో శ్రీహరి ఏభై నిమిషాలనుంచీ నిరీక్షిస్తున్నాడు.

చుట్టూ ఎత్తైన నల్లని కొండలు. రోడ్డుకిరువైపుల బారుగా రాజ్యాన్ని కాపలా కాసే సైనికుల్లా నిలబడున్న చెట్లు తప్ప అక్కడింకేమీ కానరావడం లేదు

ఆ ప్రదేశం జాతీయ రహదారికి వున్న లింకురోడ్డులో పట్టణానికి ముప్పై అయిదు కిలోమీటర్ల దూరంలో వుంది.

శ్రీహరి సినిమా నటుడు, రచయిత, నిర్మాత. అతనికో అలవాటుంది—అతని కథకు మంచి ప్లాట్ కావలసినప్పుడు, షూటింగు జరుపుకోవడానికి అనువైన లొకేషన్స్ ఎన్నుకోవలసి వచ్చినపుడు ఒక్కడే కారేసుకుని డ్రైవ్ చేసుకుంటూ తనకిష్టమైనంత సేపు యిక్కడ అక్కడ అనకుండా తిరుగుతూంటాడు.

ఆరోజు కూడ అతను అలాగే బయలుదేరాడు. అయితే దురదృష్టవశాత్తు

రేడియేటర్‌లో నీళ్లు అయిపోవడంతో ఆ నిర్జన ప్రదేశంలో ఒంటరిగా నిలబడవలసొచ్చింది. నీళ్ల డబ్బాలో నీళ్లున్నవీ లేనివీ ముందుగా చూసుకోని తన నిర్లక్ష్యానికి తనను తన అసిస్టెంట్లును కసిదీరా తిట్టుకున్నాడు.

అప్రదేశంలో ఎక్కడా నీటిచుక్క వున్న జాడేమి కన్పించకపోవడంతో వుసూరుమంటూ కారుని రోడ్డుప్రక్క ఆపి దాన్నానుకుని సిగరెట్ కాలుస్తూ నించున్నాడు.

అరగంట గడిచినా అటువైపు ఒక్క వాహనం గానీ, మనిషిగానీ రాకపోవడంతో అతనిలో ఓరకమైన ఆందోళన, కొద్దిపాటి భయం బయలుదేరాయి.

వెంట తెచ్చుకున్న సిగరెట్ పేకెట్ లోని సిగరెట్లు కూడా అయిపోయాయి. అప్పుడు సాయంత్రం ఆరుగంటలైంది. పశ్చిమాద్రిన సూరీడు డ్యూటీ దిగిపోవడానికి తొందరపడుతున్నాడు.

శ్రీహరి చూపు సడన్‌గా నిల్చిపోయింది.

దూరంగా రెండు ఆకారాలు.... యిటే వస్తున్నాయి.

శ్రీహరిలో చచ్చిపోతున్న ఆశ చిగురించింది.

ఆ ఆకారాలు యింకొంచెం దగ్గరకొచ్చేయి....

ఓ ముసలాడు- అతని వెంట ఓ పదేళ్ళ కుర్రాడు.

యిప్పుడు ఆ రెండు బక్కచిక్కిన శరీరాలు అతని ఎదురుగా వున్నాయ్. శ్రీహరి కళ్లకు వాళ్లిద్దరూ వరాలిచ్చే దేవుళ్లా కనబడ్డారు.

ముఖమంతా ముడతలుపడిపోయి, కళ్లు లోతుకుపోయి గడ్డం పెరిగిపోయి సంస్కారం లేని తెల్లని పీచులాంటి జుట్టుతో అసహ్యంగా వున్నాడు ముసలాడు. ఒంటిమీద చిన్న తుండుగుడ్డ తప్పితే యింకేమీ లేదు కాళ్లూ, చేతులూ ములక్కాడల్లా వ్రేలాడుతున్నాయ్. ఎడమచేయి ఓ పొడుగాటి కర్రను ఆధారం చేసుకుంటే కుడిచేయి పిల్లాడి భుజాన్ని ఆశ్రయించింది.

పిల్లాడి ఒంటిమీద చిన్న గోచీ మాత్రమే వుంది.

వాళ్ళిద్దర్నీ చూసిన శ్రీహరి అసహ్యించుకోలేదు

"తాతా! ఈ దరిదాపుల్లో నీళ్లు ఎక్కడైనా దొరుకుతాయా?" ఎంతో ఆశగా అడిగాడు.

తాత-"అబ్బో ఈడెక్కడ దొరుకుతాయ్ బాబూ-నీళ్ళకి నాల్గుకోసుల దూరం పోవాలి" అన్నాడు నీళ్లు తీసుకురావడం సామాన్యమైన విషయం కానట్టు.

శ్రీహరికి ఆ దూరం ఎంతో తెలీదు కానీ అతనికి అర్జెంటుగా నీళ్లు కావాలి.

"కొంచెం నువ్వెళ్లి తీసుకురాగలవా తాతా! నీళ్లు లేక కారాగిపోయింది. యిక్కడ చాలా వేపట్నుంచి

నుంచున్నాను"—శ్రీహరి గొంతులో అఙ్ఞలేదు ఆశృత వుంది-అర్థింపు వుంది.

"నీళ్ల తేవానికి మికాదేటున్నాది ?" తాత అడిగాడు.

"యిదిగో నీళ్లడబ్బా" తీసిచ్చాడు.

"ఒరేయ్ బుడ్డోడా ! లగెత్తుకెళ్లి దీవ్నిండా నీళ్లుట్కొచ్చెయ్" తాత డబ్బా పిల్లాడి చేతికిస్తూ అన్నాడు.

బుడ్డోడు పరిగెత్తాడు.

వెళ్లిపోతున్న బుడ్డోడ్ని చూసి, "బేగి రావాలి" అన్నాడు తాత కొంచెం గొంతు పెంచి.

* * *

శ్రీహరి-అతనెదురుగా తాత.

పిల్లాడు వెళ్లి పదినిముషాలు గడి చాయి. వాడింకా రాలేదు శ్రీహరికి బోర్ కొడుతోంది.

అతనికి తాతతో నాల్గుమాటలు మాట్లాడా లనిపించింది.

"తాతా ! నీ పేరేమిటి ?"

"సిమ్మాద్రి బాబూ !"

"ఆ పిల్లాడు నీ కొడుకా?" శ్రీహరి.

"నేదు బాబూ ! మనవడు" తాత చెప్పాడు.

"మరి వాడి తల్లీ, తండ్రిలేడా." మళ్ళీ శ్రీహరి అడిగాడు

"నేరుబాబూ ! అమయ్య ఏనాడో సచ్చిపోనాడు. అడికమ్మ వుండీ లేనట్టే.." నెమ్మదిగా అన్నాడు తాత.

"అదేం ?"

"వదిలేసి ఎల్లిపోనాది బాబూ !" దిగులుగా అన్నాడు తాత.

"ఎందుకని ?" శ్రీహరి గొంతులో తాత గురించి వివరాలు తెలుసుకోవాలన్న వుత్సాహం కనబడింది.

తాత చెప్పాడు- "బాబూ ! ఏటి సెప్పాల ? నోకం అన్నేయం మీదనే నడత్తోంది. అడిబాబు అంటే నా కొడుకు అప్పన్నగోడు బతికున్న రోజుల్లో అకు, అడిపెళ్ళాం ఎంతో యిదిగా వుండే వోరు. కానీ దిక్కుమాలిన సచ్చినోళ్ళ దానందం సూసి కన్నుకుట్టి దాన్ని పాడు సెయ్యాలని సూసారు యిషయం తెలుసుకున్న నా బిడ్డడు వుండబట్నేక, అళ్లం దరిమీద తిరగొడ్డాడు. అళ్లంతా ఒకటై పోయి ఓ రాత్రేల సముద్రం మీదికి సేపలట్టడానికి ఎల్లిన నా బిడ్డడి నావతో పాటే సముద్రంలో ముంచి సంపేశారు. 'ఏందిరా ఈ గోరం'? అంటే-అది నావ సుడిగుండంలో సిక్కుకుపోనాదని, ఎంత పెయత్నించినా నాబం నేకపోయిందని అందుకే అకు సచ్చిపోనాడని తీరుపు సెప్పారు ..సూసావాబాబూ అన్నేయం?" తాత గొంతులో బాధ... కళ్లల్లో నీరు.

"మరి నీ కోడలేమైంది తాతా ?" శ్రీహరి అడిగాడు.

ఆ మాటకు తాతలో ఆవేశం పెల్లుబికింది. . అయినా తమాయించుకుని "కండ కారవవెక్కి ముండది నెగిసిపోనాది. సిత్రం ఏటంటే బాబూ ఒవుడయితే దీని

మొగుణ్ణి సంపేసాదో అద్నే యిది వుంచుకున్నాది. 'ఏటే యిది' అనడిగితే 'అదే అడికి నష్టపరిహారం' అంది.

శ్రీహరిలో రచయిత మేల్కొన్నాడు. అతని బుర్రలో ఆలోచన చటుక్కు-మంది.

తాత చెప్పిన కథ అతని బుర్రలో వేగంగా తిరుగుతోంది.

"యిదిగో తాతా" వగర్చుకుంటూ నీళ్ల డబ్బాని అందించాడు పిల్లాడు. ఆ డబ్బా క్షణాల్లో చేతులుమారి, దానిలోని నీళ్ళు రేడియేటర్‌లోకి వెళ్లిపోయాయి. కారు స్టార్టయింది.

శ్రీహరి జేబులు తడుముకున్నాడు. నోట్లు తప్పించి చిల్లర కనబడలేదు.

కారులోపల కూర్చుని గట్టిగా తలుపేసుకున్నాడు.

ఒక్క నిమిషంలో కారు వేగంగా దూసుకుపోయింది - అక్కడున్నవాళ్ల మొహాలమీద దుమ్ము కొడుతూ.

"పెద్దోళ్లు" గట్టిగా నిట్టూరుస్తూ అనుకున్నాడు సింహాద్రితాత.

• •

రచయిత, నటుడు, నిర్మాత శ్రీహరికి ఘనంగా పౌరసన్మానం జరుగుతోంది.

అతను రచించి నిర్మించిన 'పేదల బతుకులు' అత్యంత ప్రజాదరణ పొందడమే కాకుండా రాష్ట్రప్రభుత్వ బహుమతిని కూడా గెల్చుకుంది.

అందంగా అలంకరించబడిన వేదిక మీదికి ప్రముఖులు ఒక్కొక్కరే వచ్చి శ్రీహరిని పుష్పమాలాంకృతుణ్ణి చేసి, అతన్ని, అతను నిర్మించిన చిత్రాన్నీ పొగిడి వెళ్లిపోతున్నారు.

ఆ సన్మానానికి అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రిగారు "శ్రీహరి నట, నిర్మాతగానే అందరికీ తెలుసు కానీ ఆయన మహారచయిత అని ఆయన రచించి నిర్మించిన ఈ చిత్రమే చెబుతోంది. ముఖ్యంగా అట్టడుగున వున్న పేదల బ్రతుకుల్ని- వాళ్ళ సాధక బాధల్ని కడు రమ్యంగా రచించి చిత్రించిన శ్రీహరిగార్ని మీ అందరి తరపున సన్మానించడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అంటూ సెలవు తీసుకున్నారు.

ఆఖరిగా శ్రీహరి మైకు దగ్గరకొచ్చి "పెద్దలందరూ నా గురించి ఎక్కువగానే మాట్లాడారు. వాళ్ళందరికీ నా కృతజ్ఞతలు. నా గురించి నేను చెప్పుకునే దేమీలేదు. అయితే ఒక్కమాట సవినయంగా మనవి చేసుకుంటున్నాను. ఈ చిత్రం ప్రత్యేకంగా పేదల సాధకబాధల్ని చాటిచెప్పుతోంది. మన దేశంలో పాతుకుపోయిన ఈ పేదరికాన్ని నిర్మూలించాలంటే- ధనికులంతా ముందుకు రావాలి. పేదలకు అండదండగా నిలవాలి.... ఇకపోతే యిలాంటి చిత్రాలు యింకా ఎక్కువ వచ్చి ప్రజల్లో చైతన్యం కలిగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. చిన్నవాణ్నయిన నన్ను మీరెప్పటిలాగనే

అభిమానించాలని- మీ ఆదరాభిమానాలు కాపాడుకోవడానికి నేనెప్పుడూ కృషి చేస్తుంటానని చెపుతూ వినయంగా సెలవు తీసుకుంటున్నాను" అన్నాడు.

* * *

సిమ్హాద్రి తాత గుంపులో నించుని వున్నాడు.

అతనికి ఆ గొంతు ఎప్పుడో ఎక్కడో విన్నట్టుంది.

మనవడి భుజంమీద చేయివేసి ముందుకునడుస్తున్నాడు. జనంలో ఇప్పుడు మాట్లాడిన మనిషిని చూడాలని అతని కెంతో ఆతృతగా వుంది.

జనం తుస్సేస్తున్నారు.

ఇసక వేస్తే రాలనంత జనం. జనం రాపిడిలో తొక్కిసలాటలో ఎవరెటు పోతున్నారో ఎవరికీ తెలీడంలేదు.

పోలీసులు ఎంతో బందోబస్తుతో మంత్రుల్ని, నటుల్ని, కార్లవరకూ తీసుకెళ్తున్నారు. అయినా సరే జనాన్ని కంట్రోలు చేయలేకపోతున్నారు. కార్ల చుట్టూ చేరిన జనం శ్రీహరిని దగ్గరగా చూడాలని తెగ తాపత్రయపడి పోతున్నారు.

పోలీసులు లాటీ లుపయోగించి ప్రజల్ని దూరంగానెట్టేస్తున్నారు. లాటీలు గాల్లో విన్యాసం చేస్తున్నాయ్.... ఓ లాటీ వచ్చి 'టపీ' మని సిమ్హాద్రి తలమీద పడింది.

అతని తల తిరిగినట్టయింది. కళ్లు బైర్లుకమ్మాయి. కాళ్ళు తేలిపోతున్నాయి పిల్లాడు జనంలో ఎటు కల్సి పోయాడో తెలీదు.

అకస్మాత్తుగా స్పృహ తప్పినట్టయింది.

నేలమీద పడిపోయాడు... పైనుంచి జనం తొక్కుకుంటూ పోతున్నారు. ఎముకలు పటపట మంటున్నాయి .... ఒళ్ళు హూనమైపోయింది. అరవడానికి గొంతు పెగల్లేదు....

పదిహేను నిముషాల్లో కార్లన్నీ వెళ్ళి పోయాయి. జనమంతా చెల్లాచెదరై పోయారు.

అప్పటివరకూ తిరనాళ్ళలా ఎంతో సందడిగా వున్న ఆ ప్రదేశం నిముషాల్లో శ్మశానవాటికలా అయిపోయింది.

సిమ్హాద్రి తాత పెల్లకిలా పడున్నాడు.

అతని గుండెలు ఎగిసెగసి పడుతున్నాయి. నోట్లోంచి రక్తం కారుతోంది. కళ్లల్లోంచి నీరు ధారగా ప్రవహిస్తోంది. ఆయాసంలో గట్టిగా మూల్గుతున్నాడు.

పరిగెత్తుకొచ్చిన మనుమడు తాత పక్కనే భయంగా చూస్తూ కూర్చుని వున్నాడు.

తాత ఒక్కసారి మనుమడి మొహం లోకి ఆశగా చూశాడు. ఏదో చెప్పాలని నోరువిప్పాడు... గొంతులోంచి మాట రాలేదు. పిల్లాడి చేయిమీద చేయివేసాడు. పిల్లాడు ఏడుస్తున్నాడు. గుప్పెళ్ళు గట్టిగా బిగుసుకుని ఒక్కసారివదులై పోయాయి.

చేతిలోవున్న నాలుగైదు చిల్లర పైసలు నేల మీద దొర్లుకుంటూ పోయాయి. మరుక్షణం 'తాతా' అన్న మనవడి ఆర్తనాదం సహాయం అందనంత దూరం పలికింది.

తాత చెప్పిన కథనే సినిమాగా తీసి లక్షలు గడించుకున్న వైనం శ్రీహరికి గుర్తుందో లేదో తెలీదుగానీ తన చేతిలో ఐదుపైసలు కూడా పెట్టకుండా తన బ్రతుకు ఖరీదుని లక్షల్లో దోచుకున్నాడని తాతకూ తెలీదు. తెలిస్తే... ?

పాపం... ఆ ఆత్మ ఏమనుకునేదో? ఏమో?

—